

కథా కౌముది

వెనక్కి తిరిగి చూడు

హేమ మాచెర్ల

థంప్ థంప్ థంప్....వెనకనించి వినిపించే బరువైయిన బూట్ల శబ్దం రాను రాను గట్టిగా దగ్గరగ వినబడసాగింది. నేను మరింత వేగంగా పరుగెత్తడానికి ప్రయత్నించాను కానీ కాళ్ళు చెప్పినట్టు వినడంలేదు. వయసులో ఉన్నపుడయితే గాలిలాగా రివ్వున పరుగెత్తేవాణ్ణి. నన్నెవరూ పట్టలేరు, నాకు సాటి ఎవరూ లేరు. ఇప్పుడు ఒక చిన్న సూపర్ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్ కు లొంగిపోవాల్సొచ్చింది. క్షణం కూడ పట్టలేదతనికి నన్నందుకుని కదలకుండా పట్టుకోడానికి. సింహం నోట్లో చిక్కుకున్న జింకపిల్లలా గింజుకున్నాను కానీ ఇక నా ఆటలు సాగవని తెలిసిపోయింది.

అతని బలమయిన చేతుల్లో చిక్కుకున్న నన్ను గొరగొరా లాక్కుంటూ పై అంతస్తులో ఉన్న మేనేజర్ ఆఫీస్ రూంలోకి నెట్టి పడేసాడు.

నా చిక్కిపోయిన శరీరం, లోతుకు పోయిన కళ్ళు చూసి కాబోలు షాప్ మేనేజర్ కళ్ళల్లో కాస్తంత దయ కనిపించింది. ఒక్క క్షణం నన్నతడు దయతలచి విడిచిపెడుతాడేమో అనే ఆశ నా మనసులో. కానీ మరుక్షణం అతని ముఖం కటువుగా మారింది. అతని వేళ్ళు ఫోన్ మీటలు నొక్కాయి.

అసలు దీనికంతా కారణం నా చిన్నప్పుడు, అయిదేళ్ళ వయసులో నేను అపహరింపబడడమె.

ఆ కొంకర్లు పోయే డెసెంబర్ నెలలోని ఆ రోజు నాకింకా గుర్తు.

ఆ రోజు ఉదయం క్రిస్మస్ మార్కెట్కు వెళ్తున్నామని మా అమ్మ చెప్పినప్పట్నించీ నాలో ఎంత సంతోషం చెలరేగిందో చెప్పలేను. ఆ మార్కెట్ అంటే నాకెంతో ఇష్టం. ముందువరుసలో ఉన్న స్వీట్ షాపులో నాకిష్టమని అమ్మ లెమన్ పిప్పర్మెంట్లు కొనిస్తే అవి చప్పరిస్తూ, అక్కడ స్టాల్స్ లో ఉన్న రకరకాల వింత వస్తువులు చూస్తూ అమ్మవెంట తిరగడం ఎంత సరదాగా ఉండేదని.

ఆరోజు కూడా ఎప్పటిలాగే అమ్మ నా చెయ్యి గట్టిగా పట్టుకుంది. ఇద్దరం మార్కెట్లోకడుగు పెట్టాము. ఒకవేపు లౌడ్ స్పీకర్లో 'జింగిల్ బెల్స్...' మొదలగు క్రిస్మస్ పాటలు, మరోవేపు తెల్ల గడ్డాల శాంటాలు ఎర్రని డ్రెస్స్ లో భుజానికి ఎర్రని జోలె సంచీలో రకరకాల బొమ్మలు పెట్టుకుని పిల్లలను పలకరిస్తూ తిరుగుతున్నారు.

క్రిస్మస్ ట్రీ డెకొరేషన్లు అమ్మే షాప్ వద్ద ఆగింది అమ్మ. ఆ రంగురంగుల మెరిసే గాజు బుడ్లు, నక్షత్రాలు, ఫెయిరీలు, బండిలో కానుకలు మోసుకొస్తున్న సాంటాలు, ఆ బండ్లను లాగే జింకలు, మొదలగునవన్నీ విస్మయంగా చూస్తూ నిలబడ్డాను. ఏదో కొంటూ నా చెయ్యి వదిలేసింది అమ్మ. ఇంతలో దూరంగా పెద్ద బరువయిన సంచీ భుజానికి వేళాడేసుకున్న శాంటా ఆకర్షించాడు నన్ను. నాకు తెలుసు ఆ సంచీలో నాలాంటి పిల్లలకోసం ఎన్ని బొమ్మలుంటాయో అని. అతనివేపే కుతూహలంగా చూస్తూ నిల్చున్నాను. అటూ ఇటూ చూస్తూ జనాన్ని గమనిస్తున్న అతని చూపులు మావేపు మళ్ళాయి.

చివరికి మా ఇద్దరి చూపులు కలుసుకున్న తరుణంలో దగ్గరికి రమ్మని సైగ చేసాడు. రివ్వున పరుగెత్తాను అతని దగ్గరికి.

అతను నవ్వుతూ అమాంతం నన్ను ఎత్తుకున్నాడు.

"నా సంచీలో ఎన్ని బొమ్మలున్నాయో చూస్తావా?" అడిగాడు.

చూస్తానని కుతూహలంగా తలూపాను.

"సరే అయితే మనం కాస్త దూరంగా వెళ్దాం అక్కడయితే తీరికగా చూడొచ్చు. వెనక్కి తిరిగి చూడకుండా నాతో రా," అంటూ నా చెయ్యి పట్టుకుని కార్ పార్క్ వేపు వడిగా అడుగులు వేసాడు. అతని చేతిలోని నా చెయ్యి అలాగే ఉండిపోయింది. నేనూ పరుగెత్తాను అతని వెంట.

పరాయి వాళ్ళతో మాట్లాడకూడదని, వెళ్ళకూడదని అమ్మ చెప్పిన మాటలు గుర్తున్నాయి. కానీ ప్రతి క్రిస్మస్ కూ కానుకలు తెచ్చే శాంటా పరాయివాడు కాడుకదా. శాంటాను చూసిన సంతోషంలో అమ్మతో చెప్పడం మర్చిపోయాను.

అతను నన్ను కార్ వెనక సీట్లోకి ఎత్తి కూర్చోబెడుతూ, "నిన్ను నేను బొమ్మల లోకానికి తీసుకెళ్తున్నాను," అన్నాడు.

"మరి నేను మా అమ్మకు చెప్పలేదుకదా ఎలా?" అన్నాను.

"ఏం ఫర్వాలేదు ఆమెకు తెలుసు. మళ్ళీ త్వరగా వస్తాం కదా," అన్నాడు.

కార్ ఊరు దాటి మోటార్ వే మీద వెగంగా వెళుతూంది. అప్పటికే చాలా సేపయింది. అతను చెప్పిన బొమ్మల లోకం ఎంతకూ రావడం లేదు. మెల్లిగా నా సంతోషం నీరుకారిపోసాగింది. అమ్మ కావాలనిపించింది.

"నాకిప్పుడు బొమ్మల లోకం వద్దు. మా అమ్మ కావాలి" అడిగాను శాంటాను.

"ఇంకాసెపట్లో వస్తుంది బొమ్మల లోకం. ఎన్నిబొమ్మలుంటాయో తెలుసా? మరి అవన్నీ చూడవూ?"

ఇష్టం లేకున్నా తలూపాను.

ఎన్ని గంటలు అలా ప్రయాణం చేసామో తెలియదు. చీకటి పడసాగింది. మనసులో ఏదో భయం, దిగులు. అమ్మ కావాలని ఏడుపొస్తూంది. ఇక ఆపుకోలేక "నాకిప్పుడు అమ్మ కావాలి. నన్ను మా అమ్మదగ్గరికి తీసుకెళ్ళు" అంటూ పెద్దగా ఏడ్చాను.

"నోరు మూసుకుంటావా లేదా!" గట్టిగా అరిచాడు శాంటా.

"నాకు బొమ్మలొద్దు. అమ్మ కావాలి" వెక్కెక్కి ఏడుస్తూ గోల పెడుతూ ముందుకు వంగి కార్ డోర్ హాండిల్ అందుకో బోయాను.

ఒక్క విసురుతో స్టీరింగ్ వీల్ పక్కకు తిప్పి పెద్ద కుదుపుతో హార్డ్ షోల్డర్ పై తీసుకుని కారు ఆపి వెనక్కి చూసాడు సాంటా. ఎర్రబడ్డ అతని కళ్ళల్లో కరుణ బదులు క్రూరత్వం. "మొద్దువెధవా నోరు మూసుకు కూర్చో."

"కూచోను." పెడసరంగా అంటూ సీట్ లోంచి లేవబోయాను.

శాంటా బలంగా ఒక్క నెట్టు నెట్టాడు నన్ను.

వెనక్కి పడిపోయాను.

అతని బలమయిన చేతులు నా చాతీని నొక్కిపట్టాయి.

ఊపిరాడలేదు నాకు. శక్తంతా కూడతీసుకుని రెండు కాళ్ళతో బలంగా తన్నాను అతణ్ణి.

"నువ్వొక పిల్ల రాక్షసుడిలా ఉన్నావురా" అంటూ నా చెంప చెళ్ళుమనిపించాడు.

ఒకచేత్తో నన్నదిమి పట్టుకుని మరో చేత్తో జేబులోంచి తాడు తీసి నా రెండు కాళ్ళూ చేతులూ కట్టిపడేసాడు. విదిలించే నా తల గట్టిగా పట్టుకుని నోరుకడ్డంగా టేప్ అతికించాడు.

ఇప్పుడు కనీసం అరవను కూడా అరవలేను. నా కళ్ళనించి వేడి నీళ్ళు అలా మౌనంగా కారుతూనే ఉన్నాయి.

బహుశా నేనునిద్రపోయానో లేక భయంతో తెలివితప్పి పోయానేమో, ఆతర్వాత ఏమయిందో నాకేం తెలియలేదు.

తెలివి వచ్చేసరికి ఏదో గట్టి నెలపై పడి ఉన్న అనుభూతి.

మెల్లిగా కళ్ళు తెరిచాను. మంటగా అనిపించాయి. కొన్ని క్షణాలు పట్టింది నేనొక చిన్న చీకటి గదిలో పడి ఉన్నానని తెలియడానికి. మూసి ఉన్న కిటికీ పరదాల అంచుల్నించి కనిపించే చిన్న గీతలాంటి తెల్ల వెలుగు చెప్పింది అప్పుడే తెలతెలవారుతూందని. చుట్టూ చూస్తే గది ఖాళీగా ఉంది. ఏమీ అర్థం కాక అయోమయంగా "అమ్మా," అని పిలవబోయాను. కానీ నోరు తెరువరాకుండా పెదవులకడ్డంగా టేప్ అతికి వుంది. నా రెండు కాళ్ళూ చేతులూ ఇంకా కట్టిపడేసే ఉన్నాయి. "క్షమించమ్మా నువు చెప్పినట్టు విననందుకు" అంటూ మనసులోనే ఎలుగెత్తి ఏడ్చాను.

అలా ఎన్ని రోజులు పడి ఉన్నానో తెలియదు. ఆకలితో కడుపు గోల పెడుతూంది. నోరు తడి ఆరిపోయి పిడచకట్టుకుని పోయింది. కానీ వీటన్నిటికన్నా ఎక్కువ అమ్మ లేని బాధ. ఒంటరి తనం నన్ను మరింత భయపెట్టింది.

"అమ్మా..." మనసులోనే పిలిచాను, "త్వరగా వచ్చి నన్నిక్కడినించి తీసుకో అమ్మా. ఇకనుంచీ నువ్వు చెప్పినట్టే వింటానమ్మా. అసలే అల్లరిచేయనమ్మా." అమ్మతో మొరపెట్టుకున్నాను.

ఎక్కడ ఆ రాక్షసి శాంటా వచ్చి ఒళ్ళు హూనం చేస్తాడో, లేక కధల్లో లాగా దయ్యాలూ, భూతాలూ వచ్చి నన్ను కబళిస్తాయో అని భయంతో ముచ్చెమటలు పోసి కళ్ళు గట్టిగా మూసుకుని గది మూలలో ముడుచుకుని పడుకున్నాను.

ఎట్టకేలకు గది తలుపు తెరుచుకుని ఒకతను లోపలికి వచ్చాడు. కాని అతను శాంటా కాడు

ఎవరో జీన్స్ టీషర్ట్ వేసుకుని ఉన్నాడు కాని అతని కళ్ళు మాత్రం గుర్తుపట్టాను. అప్పుడు నా చిన్ని మనసుకు కూడా అర్థమయింది అతను సాంటానే అని. నేను చదివిన కధల పుస్తకంలోని లిటిల్ రెడ్ రైడింగ్ హుడ్ లోని కధలో చెడ్డ నక్క లాగా ఇతను వేషం మార్చాడని.

"ఆకలేస్తుందా?" అడిగాడు.

అవునన్నట్టు తల ఊపాను.

"నీ ఆకలి తీరాలంటే నేను చెప్పినట్టు వినాలి."

వింటానన్నట్టు తలూపాను.

అప్పుడొచ్చి కట్టిన తాళ్ళు ఊడదీసాడు. పెదవులపై అతికిన టేప్ తీస్తుండగా విపరీతమయిన నొప్పికి ఊపిరి బిగబట్టి తర్వాత గట్టిగా అరిచాను.

"షట్ ఉప్. నోరు మూసుకో వెధవా" అతని చెయ్యి పైకి లేచింది. ఎర్రని నిప్పుకణిక తాకినట్టు మండింది నా బుగ్గ.

భయంతో వణుకుతూ గొంతులోంచి పెల్లుబికే ఆర్తనాదం బయటికి రాకుండా రెండు చేతులతో నోరు మూసుకున్నాను. అయినా తప్పించుకుని చిన్న వెక్కిళ్ళు బయటపడుతూనె ఉన్నాయి.

వారం రోజులయ్యేసరికి ఆ దెబ్బల బాధ భరించలేక అన్నిటికీ మౌనంగా ఉండడం నేర్చుకున్నాను. అమ్మ గురించి అడగడం కాదుకదా అమ్మా అని మనసులో తప్ప పైకి ఉచ్చరించడం కూడా మానేసాను. చివరికి అతని బలవంతం వల్ల అయిష్టంగానే అయినా ఆ మనిషిని నాన్నా అని పిలవడం నేర్చుకున్నాను. కాని నా మనసులో అతనికెప్పుడూ నాన్న స్తానం లేదు. మానాన్న అంటే హాల్లో వేలాడే ఫొటోలో నవ్వుతూ, ప్రేమనిండిన కళ్ళతో నా వేపు చూసే నాన్నే నా మనసులో ఉండే అసలు నాన్న. ఈ జోసెఫ్ అనబడే వ్యక్తి మాత్రం ఎప్పటికీ నాకు చెడ్డ శాంటానే.

కాలం ఎవరికోసమూ ఆగకుండా పరుగెడుతూనే ఉంది. ఏది పెడితే అది తిన్నాను. రాత్రిళ్ళు అమ్మకోసం పైకి వినిపించకుండా దిండులో ముఖం దాచుకుని విలపించాను.

మొదట్లో అసలు రాత్రో పగలో తెలియకుండా ఆ గదిలో అలాగే పడి ఉన్నాను. బహుశా నెలరోజులయినా ఉండి ఉంటానేమో? తెలియదు. ఒకరోజు మళ్ళీ నన్ను లాక్కొచ్చి కార్లో పడేసి ఒకరోజంతా డ్రైవ్ చేసాడు. ఎక్కడికో మరింత

దూరంగా తీసికెళ్ళిపోతున్నాడని అర్థమయింది. చివరికి, చాలా రాత్రయింతర్వాత ఒక చిన్న ఇంటిముందు ఆగింది కార్. చీకటి గుయ్యారం లాంటి ఆ ఇంట్లోకడుగు పెట్టాము.

ఎందుకో గోడ మీది కాలెండర్ చూస్తే ఆరోజు 29 సెప్టెంబర్ అని తెలిసింది. అంటే నా పుట్టిన రోజు. నాకు అయిదేళ్ళు నిండుతాయి. అమ్మ ఎంతో అల్లారుముద్దుగా జరిపిన నా గత నాలుగు పుట్టినరోజులూ గుర్తొచ్చి మనసు బాధగా మూలిగింది.

ఆ ఇంట్లో చేరిన కొద్ది రోజులకు నన్ను బాత్రూం లోకి తీసుకెళ్ళి నా తలంతా షేవ్ చేసాడు చెడ్డ శాంటా. అమ్మకెంతో ఇష్టమయిన నా రింగుల జుట్టు కట్టలుకట్టలుగా తెగి నేలమీద పడుతుంటే నా కళ్ళు జలాశయాలయ్యాయి.

ఆ మరునాడు నన్ను స్కూల్లో చేర్పించాడు. ఎవరైనా అడిగితే అమ్మ చచ్చిపోయిందని చెప్పమన్నాడు. అలా చెప్పాలంటే చాలా బాధగా అనిపించేది కాని అతను వేసే శిక్షలకు భయపడి అలా చెప్పక తప్పలేదు.

చిన్నప్పుడు నేనెప్పుడూ భయంగా, సిగ్గుగా ఎవరితో మాట్లాడకుండా ఉండేవాడిని. దానికితోడు ఆకలి. స్కూల్లో నేనెప్పుడూ ఒంటరినే. ఎప్పుడూ వెనక బెంచీలోనే. టీచర్లు ఏం చెపుతున్నారో మనసుకు ఎక్కేది కాదు. మార్కులు సరిగా రాకపోవడంతో టీచర్లెప్పుడూ తిడుతూనే ఉండేవారు. ఒక్కోసారి అనిపించేది, నేనుఇదివరకులా అమ్మతో ఉంటే, ఆమె ఆదరణలో పెరిగితే బాగా చదువుకునే వాడినేమో? మిగతా పిల్లల్లా హాయిగా నవ్వుతూ ఉండే వాడినేమో? అయినా ఇప్పుడు నాకెలా తెలుస్తుంది?

ప్రతి వీకెండ్ చెడ్డ సాంటా నన్ను పనికి తీసుకెళ్ళేవాడు. అతనికెక్కువ కష్టం కాలేదు నాకు నేర్పటానికి. ఎందుకంటే త్వరగా నేర్చుకోకపోతే పడే శిక్ష నాకు తెలుసు. అన్ని మెలకువలూ నేర్చుకున్నాను.

మగవాళ్ళ జేబుల్లో పైకి కనీకనిపించని పర్సులు, చిన్నగా మడిచి లోపలికి కుక్కిన నోట్లు, చేతుల రిస్ట్ వాచీలు, బ్రేస్లెట్స్, వేళ్ల ఉంగరాలు ఎలా తియ్యాలో, ఆడవాళ్ళ హాండ్ బాగులు, మెళ్ళోని గొలుసులు ఎలా కత్తిరించాలో అన్ని రకాల విద్యలూ నేర్పాడు.

"నీ చేతి వేళ్ళు అతి సున్నితంగా, పక్షి ఈక అంత తేలికగా ఉండాలి పిక్ పాకెటింగ్ చేసే అప్పుడు" అనేవాడు. రోజూ పార్క్ కు తీసికెళ్ళి పెద్ద పెద్ద అంగలు వేస్తూ గాలికన్నా వేగంగా పరిగెత్తడం నేర్పాడు. పాదాలు అసలు భూమిని తాకకుండా తెలిపోతున్నట్లుండాలి అనేవాడు.

మేము ఎన్నో ఊర్లకు, ఎన్నో షాపింగ్ సెంటర్లకు, ఆక్స్ఫర్డ్ స్ట్రీట్, కావెంట్ గార్డెన్ లాంటి రద్దీ స్థలాలకు, రైల్వే స్టేషన్లకు తరుచుగా వెళ్ళేవాళ్ళం. మా పని వారాంతాల్లో, జనాలు కిక్కిరిసి ఉంటారు కాబట్టి, తేలికగా అయిపోయేది. క్రిస్మస్ అయితే మరీ. ఎక్కడ చూసినా ఇసుకరాలనంత జన కోలాహలం. ఒక్క డబ్బే కాకుండా మాకు చాలా నగలు, ఇతర విలువయిన వస్తువులు కూడా దొరికేవి. చెడ్డ శాంటా వాటన్నిటినీ ఎక్కడకో తీసుకెళ్ళి మంచి ధరకు అమ్మేసేవాడు. సాయంత్రాలు అతను పబ్ కు వెళ్ళి ఏ అర్థరాత్రికొ తిరిగొచ్చేవాడు. ఒక్కోసారి రాత్రంతా రాకపోయేవాడు.

అలా మారిపోయింది నా జీవితం.

నా పదహారో ఏట చదువు ఆపేసి పిక్ పాకెటింగ్ నా ప్రొఫెషన్ గా మార్చుకున్నాను.

చెడ్డ శాంటా నా జీవితాన్నె కాదు, నా పేరు కూడా మార్చేసాడు. నా స్కాటిష్ ఆక్సెంట్ కూడా మారిపోయింది. నాకు ఇరవై అయిదేళ్ళు వచ్చేసరికి నా వృత్తిలో ఆరితేరి నా అంతటివాడు లేడనిపించుకున్నాను. చెడ్డ శాంటా గర్వపడేంత వాడినయ్యాను.

జీవితం సాఫీగా సాగిపోతూంది. చెడ్డ శాంటా ఎప్పుడూ చట్టానికి పట్టుబడలేదు కానీ అతని వ్యసనాలకు పట్టుబడ్డాడు. ఆరోగ్యం పాడయి మంచాన పడ్డాడు. అతడిని చూసుకోవాల్సిన బాధ్యత నా మీద పడింది. ఇప్పుడు నా ఒక్క సంపాదన మాత్రమే ఆధారం.

నా ముఫ్ఫయ్యో ఏట తుది శ్వాస విడిచాడతను.

ఇన్నాళ్ళూ పైకి చెప్పకపోయినా మా అమ్మను కలుసుకోవాలనే కోరిక నన్నెన్నడూ వీడలేదు. ఎప్పుడో ఒకప్పుడు ఆమెను కలుసుకుంటాననే ఆశే ఇన్నాళ్ళూ బ్రతికించింది నన్ను.

చెడ్డ శాంటా నన్ను అపహరించిన రోజుకి సరిగ్గా ఇరవై అయిదేళ్ళ నాటికి, స్కాట్లాండ్ లోని మా వూరు గ్లాస్గో కి ప్రయాణం కట్టాను.

నిజానికి ఎక్కడికి వెళ్ళాలో తెలియదు. ఇంటి నంబర్ గుర్తుంది కానీ స్ట్రీట్ పేరు గుర్తులేదు. అమ్మ పేరు కూడా సరిగా గుర్తులేదు. కొందరు ఆమెను జీనీ అనీ, జెన్నీ అనీ, జానీ అనీ పిలిచెవారని లీలగా గుర్తు. ఏది అసలు పేరో తెలియదు. ఇంటిపేరు మాగ్నమో, మాకంజీనో గుర్తు లేదు.

రెండు రోజులు సిటీ అంతా తిరిగాను. కనిపించిన ప్రతి ఒక్క మధ్య వయసు స్త్రీ మా అమ్మేనేమో అనిపించేది. పోనీ కౌన్సిల్ అఫీసులో రెకార్డ్స్ వెతుకుదామంటే నేను పట్టుబడతానని భయం ముందడుగు వేయనివ్వలేదు. చివరికి ఇక చేసేదేం లేక నిరాశగా లండన్ కు తిరిగి వచ్చాను.

నా చేతకానితనానికి నామీద నాకే కోపం, అమ్మను ఇక జన్మలొ కలుసుకోలేనేమోననే దిగులు నా హృదయాన్ని చెదలు తిన్నట్టు తింటుంటే, నాకు తెలుసు ఆ వెలితి ప్రపంచంలో ఎవరూ పూడ్చలేరని. నా గురించి నేను శ్రద్ధ తీసుకోడం మానేసాను. వృత్తి లో అప్రమత్తంగా ఉండడం మర్చిపోయాను.

నాకు నేనే గజదొంగగా ప్రమోషన్ ఇచ్చుకున్నాను. పోలీసులు ఎంత ప్రయత్నించినా, నా చిత్రం ఆర్టిస్ట్ లతో దింపించి పేపర్లల్లో వేసినా పట్టుబడకుండా, ఒక చోటినుంచి మరో చోటికి మారుతూ, వేషాలు మారుస్తూ తప్పించుకోవడం నేర్చుకున్నాను.

కానీ నా యాభయ్యో ఏట మాత్రం దాదాపు పట్టుబడబోయి ఎలాగో తప్పించుకున్నాను.

కాని చావు తప్పి కన్ను లొట్టబోయినట్టుగా, ఒక ఎత్తయిన గోడ మీంచి దునికి కాలు విరగ్గొట్టుకున్నాను. అది ఇప్పటికీ మామూలు కాలేదు. ఇక నా ప్రొఫెషన్ కుంటుబడింది. ఏ దొంగతనాలూ చెయ్యలేక పోయాను. అయినా ఎవరికోసం చెయాలి? నాకెవరున్నారని? కేవలం తిండికోసం, ఆల్కహాల్ కి బానిస అయ్యానుకాబట్టి, సూపర్ మార్కెట్లో షాప్ లిఫ్టింగ్ తప్ప.

ఎంత పెద్ద దొంగతనాలు చేసినా పట్టుబడని నేను ఈరోజు మాత్రం ఒక చిన్న వైన్ బాటిల్ కోసం పట్టుబడాల్సొచ్చింది. సెక్యూరిటీ గార్డ్ చూసాడు నేను బాటిల్ చొక్కా కింద దాచుకోవడం. నన్ను అరెస్ట్ చేసి చార్జ్ చేసారు. పోలీస్ స్టేషన్ లో నా చరిత్ర అంతా లాగారు. చివరికి తీర్పు పదేళ్ళ కారాగార శిక్ష.

జైల్లో బయటికన్నా బాగానే ఉంటుందేమొ ఎవరికి తెలుసు? కనీసం తిండి సంపాయించుకునే పని తప్పుతుంది. సెల్ లో పడేసి లాక్ చేస్తుంటే జైల్ ఆఫీసర్కేసి చూసి నవ్వాను. అతను సీరియస్ గా చూశాడు. ఇప్పటికయినా నా తప్పులు ఈ శిక్షతో కడిగేసుకోవచ్చు. ఎందుకో మొట్టమొదటిసారిగా ఎన్నడూ లేని సంతృప్తి.

నన్ను విడుదల చేసినరోజు, చేదు మందు మింగి జబ్బు నయం చేసుకున్న రోగిలా, గంగలో ముణిగి ప్రక్షాళనం చేసుకున్న పాపిలా తలెత్తుకోవాలో ఒద్దో తెలియక బయటికి వచ్చాను. ఫెయిరీ లైట్లతో అలంకరించబడిన వీధుల్లు చెప్పకనె చెప్పాయి క్రిస్మస్ వస్తూందని. నాలో ఏ భావమూ కలగలేదు. ఏ దిక్కూ దిశా, గమ్యమూ ల్లేకుండా వీధులన్నీ తిరుగుతూ, టౌన్ సెంటర్ కు చేరాను. క్రిస్మస్ మార్కెట్ లోంచి విరామం లేకుండా వినబడే జింగిల్ బెల్ల్స్ పాట ఎందుకో మనసును కలిచివేసింది.

కాస్త దూరంలో ప్లాస్టిక్ జింకలు కట్టిన బండితో పాటు ఎర్రని సంచీ పట్టుకుని శాంటా. దూరంగా ఒక చిన్న అబ్బాయి తల్లిచేతిని విడిపించుకుని శాంటా వేపు పరుగెత్తబోయాడు. ఒక్కసారిగా నల్లని కారుమేఘంలాంటి గతం కళ్ళముందు నిలిచి ఒళ్ళు జలదరించింది.

"ఒద్దు బాబూ..." తల అడ్డంగా ఊపుతూ మనసులోనే అర్ధించాను.

నా ప్రార్ధన ఆ అబ్బాయి మనసుకు వినిపించిందా అన్నట్టు కాస్త దూరంలో ఆగాడు.

"అమ్మ దగ్గరికి వెళ్ళు నాన్నా..."

ఆ అబ్బాయి తటపటాయించాడు శాంటా వేపూ, తల్లివెపూ మార్చి మార్చి చూస్తూ.

"వెనక్కి వెళ్ళు బాబూ..."

ఒక్కసారిగా వెనుదిరిగి తల్లి దగ్గరికి పరుగెత్తాడు.

ఆమె చిరునవ్వు నవ్వి వాడిని దగ్గరికి తీసుకుంది. అమ్మ చెయి గట్టిగా పట్టుకుని ఆమెతోపాటు ఇంటివేపు కాబోలు అడుగులు వేసాడు ఆ అబ్బాయి.

బ్రతుకు బరువుతో వంగిపోయిన నేను, 'నేనూ ఆనాడు ఇలా వెనక్కి తిరిగి చూసుంటే...?' అనుకుంటూ తెలియని గమ్యం వేపు భారంగా అడుగు వేసాను.

COMMENTS